క్లుప్తంగా

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి


మహిళలతో మాట్లాడుతున్న బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు

కొమరోలు: మహిళల కోసం ఏర్పాటు చేసే శిక్షణ కేంద్రాలను సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందాలని బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు సూచించారు. కొమరోలులోని కుట్టుశిక్షణ కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. జూలై 31వ తేదీన పరీక్ష నిర్వహించి సర్టిఫికెట్లు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ చెన్నారావు, పంచాయతీ కార్యదర్శి బ్రహ్మయ్య పాల్గొన్నారు.

కొమరోలు పీహెచ్‌సీ వైద్యాధికారిగా శాంతి


బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ శాంతి

కొమరోలు: కొమరోలులోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా డాక్టర్ వి.శాంతి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న డాక్టర్ చైతన్యదీపక్ గలిజేరుగుళ్ల పీహెచ్‌సీకి బదిలీ అయ్యారు. సత్యసాయి జిల్లా గుండమల్ల పీహెచ్‌సీలో విధులు నిర్వర్తిస్తున్న శాంతి కొమరోలు పీహెచ్‌సీలో నియమితులయ్యారు.

ప్రభుత్వ కళాశాల విద్యార్థి ‘విట్’లో ఉచిత అడ్మిషన్

పొదిలి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి ఎస్.భవాంజనేయులు ఇంటర్మీడియెట్‌లో 967 మార్కులు సాధించాడు. ప్రకాశం జిల్లా బాయ్స్ విభాగంలో మెరిట్ మార్కులు సాధించిన భవాంజనేయులకు అమరావతిలోని విట్ డీమ్డ్ యూనివర్సిటీలో ఇంజినీరింగ్‌లో ఉచితంగా అడ్మిషన్ దక్కింది. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రిన్సిపాల్ కె.వాసు దేవ్, అధ్యాపకులు ఉండేల నరసారెడ్డి, పి.సుజాత, పి.రమణారెడ్డి, ఎల్.పద్మారావు అభినందించారు. భవిష్యత్‌లో ఉన్నత స్థానాలు అధిరోహించి తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

నేడు కంభంలో విద్యుత్ అంతరాయం

కంభం: విద్యుత్ తీగల మరమ్మతుల కారణంగా కంభం పరిధిలోని కందులాపురం కూడలి, ప్రభుత్వ వైద్యశాల ఏరియా, భాగ్యనగర్, బస్టాండ్ రోడ్డు, నెహ్రూనగర్ ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి 11 గంటల వరకు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ వెంకట నరసయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పాఠశాలను శుభ్రం చేయించిన హెచ్‌ఎం


శుభ్రం చేయిస్తున్న హెచ్‌ఎం ప్రభుదాస్

దొనకొండ: మండలంలోని పోలేపల్లి ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల అపరిశుభ్రంగా ఉండటంతో నూతనంగా ప్రధానోపాధ్యాయుడిగా విధుల్లో చేరిన ఆదిమూలపు ప్రభుదాసు మంగళవారం జేసీబీతో శుభ్రం చేయించారు. పాఠశాల ప్రాంగణం మట్టి కుప్పలతో, పిచ్చి చెట్లతో మూసుకు పోవటంతో విద్యార్థులకు ఇబ్బంది ఉంటుందని ముందు జాగ్రత్తగా ఆయన శుభ్రం చేయించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

పడకేసిన పారిశుధ్యం


ఆకవీడులో వ్యర్థాలతో నిండి దుర్వాసన వెదజల్లుతున్న సైడుకాలువ


డ్రైనేజీలో పేరుకుపోయిన మురుగు

- రాచర్లలో మండలంలో దుర్వాసన వెదజల్లుతున్న డ్రైనేజీలు
- నెలల తరబడి పూడిక తీయకపోవడమే కారణం

రాచర్ల:

అధికారులు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నా గ్రామాలు మాత్రం మురికి కూపాలుగా దర్శనమిస్తున్నాయి. పారిశుధ్యం పడకేసి సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. నెలల తరబడి కాలువలు శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతున్నాయి. గ్రామాలు స్వచ్ఛంగా రూపుదిద్దుకోవాలంటే మెరుగైన పారిశుధ్య నిర్వహణ ప్రధాన మార్గం అనే మహాత్మా గాంధీ నినాదంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం కేవలం ఆర్భాటానికి, ప్రచారానికే పరిమితమైంది. మండలంలోని ఆకవీడు గ్రామంలో ఎక్కడ చూసిన పారిశుధ్యం పూర్తిగా లోపించింది. నూతనంగా నిర్మించిన సచివాలయ భవనం సమీపంలో రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ నిండి మడుగును తలపిస్తోంది. గ్రామంలో ఎక్కడ చూసిన రోడ్లపై మురికినీరు చేరడంతో వీధి రోడ్లు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. పలు గ్రామాల్లో ఇలాంటి పరిస్థితులే నెలకొన్నాయి. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి


ప్రధాన రహదారి వెంట చెత్తతో నిండిపోయిన కాలువ

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రిపుల్ ఐటీలో విద్యార్థులకు సీట్లు


తర్లుపాడులో విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు


పొదిలిలో విద్యార్థిని అభినందిస్తున్న డీవైఈఓ శ్రీనివాసరెడ్డి

తర్లుపాడు: ట్రిపుల్ ఐటీ ఫలితాల్లో మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. తర్లుపాడు మండలంలోని చెన్నారెడ్డిపల్లి జెడ్పీ పాఠశాలలో పదో తరగతి చదివిన విద్యార్థినులు జీవీ లీల నూజివీడులో, కె.సుప్రియ ఇడుపులపాయలో సీట్లు సాధించారు. ఈ సందర్భముగా పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థినులను ఉపాధ్యాయులు అభినందించారు. ఉన్నతస్థానాలకు చేరుకుని పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాలరాజు, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, శేఖర్‌రెడ్డి, నరసింహారావు, కోటిమోహన్, హేమలత, చంద్రశేఖర్‌రెడ్డి, రమేష్, కిశోర్, అచ్చయ్య, వీరబ్రహ్మం, శోభారాణి, శంకర్‌రెడ్డి, సుజాత, హేమలత తదితరులు పాల్గొన్నారు.

పొదలి విద్యార్థికి డీవైఈఓ అభినందన

పొదిలి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి షేక్.ఫాజిల్‌కు ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో సీటు దక్కింది. ఈసందర్భంగా ఫాజిల్‌ను డీవైఈఓ ఎం.శ్రీనివాసరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డి తమ బంధువు పాలూరి కళ్యాణ్ జ్ఞాపకార్థం ఫాజిల్‌కు ఏటా రూ.5 వేల చొప్పున రూ.30 ప్రోత్సాహక నగదు అందజేస్తామని ప్రకటించారు.

కంభం: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన నలుగురు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడం గర్వకారణమని ప్రధానోపాధ్యాయురాలు అమూల్య పేర్కొన్నారు. పాఠశాల విద్యార్థినులు కె.కవిత, షేక్ సుహాన, సుస్మిత, బి.స్వాతి పదో తరగతిలో మంచి మార్కులు సాధించడంతోపాటు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన సందర్భంగా ఉపాధ్యాయులు అభినందించారు.

పంటల బీమా రైతులే చేసుకోవాలి


మార్కాపురం : రైతులతో మాట్లాడుతున్న ఏఓ బుజ్జిబాయి

బేస్తవారిపేట: ఖరీఫ్ 2025 సంవత్సరానికిగాను ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద వరి, కంది, సజ్జ, మిరప, మినుము, నువ్వులు పైర్లు వేసిన రైతులు స్వచ్ఛందంగా బీమా చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని గిద్దలూరు ఏడీఏ బాలాజీ నాయక్ తెలిపారు. మంగళవారం నేకునాంబాద్, చింతలపాలెంలో రైతులతో మాట్లాడారు. వరి పైరుకు ఆగస్టు 31 వరకు, మిగిలిన పైర్లకు జూలై 31వ తేదీ వరకు ఇన్సూరెన్స్ చేసుకునే అవకాశం అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ అబ్దుల్ రఫీక్ పాల్గొన్నారు.

రాచర్ల: మండలంలోని అనుమలవీడు, రాచర్లలో రైతులకు ఏఓ మహబూబ్ బాషా అవగాహన కల్పించారు. ఫసల్ బీమా యోజనలో ఎకరా వరి పంటకు రూ. 860, కందికి రూ.430, సజ్జ పంటకు 150, పత్తి పంటకు రూ.2100, ఎండు మిరపకు రూ.4500, మినుముకు రూ.205 చెల్లించి రసీదు తీసుకోవాలని తెలియజేశారు.

గిద్దలూరు రూరల్: మండలంలోని కొమ్మునూరు, కొత్తకోట గ్రామాల్లో రైతులతో ఏఓ విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడారు. పంటలకు బీమా చేసుకునే రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారుపుస్తకం, పంట ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ అకౌంట్ పుస్తకం జిరాక్స్ కాపీ, ఫోన్ నంబర్ జత చేయాలిని సూచించారు.

కంభం: మండలంలోని పెద్దనల్లకాల్వ గ్రామంలో రైతులకు పచ్చి రొట్ట వినియోగంపై ఏఓ మహమ్మద్ అవగాహన కల్పించారు. డ్రోన్స్ 80 శాతం రాయితీపై ఇస్తున్నట్లు తెలిపారు. ఉద్యాన వన పంటల రాయితీల గురించి ఆ శాఖ అధికారి శేషగిరి వివరించారు.

మార్కాపురం: కౌలు రైతులు వీఆర్‌ఓలను సంప్రదించి సీసీఆర్సీ కార్డులు పొందాలని మార్కాపురం ఏఓ బుజ్జీబాయి సూచించారు. మండలంలోని తిప్పాయిపాలెం, చింతగుంట్ల గ్రామాల్లో రైతులతో ఆమె మాట్లాడారు. విత్తనాలు విత్తే పద్ధతి, పంటల బీమా గురించి వివరించారు. చింతగుంట్లలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు.

డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డికి ఘన సన్మానం


వేణుగోపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎంపీపీ, సర్పంచ్, సహచర వైద్యాధికారులు

బేస్తవారిపేట: మండలంలోని మోక్షగుండం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బదిలీ కొమరోలు మండలం రాజుపాలెం వెళ్తున్న డాక్టర్ కడప వేణుగోపాల్‌రెడ్డిని పీహెచ్‌సీ సిబ్బంది మంగళవారం ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి మాట్లాడుతూ.. డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి సేవలను కొనియాడారు. మోక్షగుండం సర్పంచ్ ఆవుల శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ వికాస్, డాక్టర్ రజిత భాను, డాక్టర్ మీర్జా, యూడీసీ గణేష్, ఎంపీహెచ్‌ఏ సావిత్రి, హెచ్‌ఈఓ నాగేశ్వరరావు, రహ్మతుల్లా రాధాకృష్ణ, ఏఎన్‌ఎంలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా సహాయ కార్యదర్శిగా దత్తాచారి

గిద్దలూరు రూరల్: విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా సహాయ కార్యదర్శిగా గిద్దలూరుకు చెందిన షరాబు దత్తాచారిని నియమించినట్లు ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసాచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వబ్రాహ్మణ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని దత్తాచారి పేర్కొన్నారు. ఆయనకు స్థానిక విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు అభినందనలు తెలిపారు.

వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుల నియామకం

మార్కాపురం/పొదిలి రూరల్: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మార్కాపురం నియోజకవర్గంలోని పలు మండలాలకు అధ్యక్షులను నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. మార్కాపురం మండల పార్టీ అధ్యక్షుడిగా పోరెడ్డి చెంచిరెడ్డి, తర్లుపాడు అధ్యక్షుడిగా మురారి వెంకటేశ్వర్లు, కొనకనమిట్ల అధ్యక్షుడిగా మోరా శంకర్‌రెడ్డి, పొదిలి నగర పంచాయతీ అధ్యక్షుడిగా సానికొమ్ము శ్రీనివాసరెడ్డిని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

సానికొమ్ముకు అభినందన

వైఎస్సార్ సీపీ పొదిలి నగర పంచాయతీ అధ్యక్షుడిగా సానికొమ్ము శ్రీనివాసరెడ్డి నియమితులైన సందర్భంగా మంగళవారం స్థానిక నాయకులు ఘనంగా సన్మానించారు. అభినందించిన వారిలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేపీ రమణారెడ్డి, కంభం ఏఎంసీ మాజీ చైర్మన్ వై వెంకటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ జి.శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

జూలై 5న జాతీయ లోక్ అదాలత్


పోలీసు అధికారులతో సమీక్షిస్తున్న న్యాయమూర్తి బాలాజీ

మార్కాపురం: మార్కాపురంలో జూలై 5వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకునేలా కక్షిదారులకు అవగాహన కల్పించాలని పోలీస్ అధికారులకు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.బాలాజీ సూచించారు. మంగళవారం మార్కాపురం కోర్టులో 6 మండలాల పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి బాలాజీ మాట్లాడుతూ.. కేసుల్లో ఉన్న వారు రాజీ చేసుకుని ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించేలా చూడటం ద్వారా సమాజంలో శాంతి నెలకొనే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రాజీపడదగిన క్రిమినల్ కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, భరణం కేసులు, బ్యాంకుల ప్రీ లిటిగేషన్ కేసులు, బీఎస్‌ఎన్‌ఎల్ ప్రీ లిటికేషన్ కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని వివరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు హెల్మెట్ తప్పనిసరిగా ధరించేలా ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించాలని న్యాయమూర్తి సూచించారు. సమావేశంలో మార్కాపురం పట్టణ ఎస్సై సైదుబాబుతో పాటు త్రిపురాంతకం, యర్రగొండపాలెం, పెద్దారవీడు తదితర మండలాల ఎస్సైలు, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణే ప్రధానం

కొమరోలు: విద్యార్థులకు మంచి అలవాట్లపై అవగాహన కల్పిస్తూ, క్రమశిక్షణతో చదువుకునేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎస్సై నాగరాజు సూచించారు. కొమరోలులోని ఎంఆర్‌సీ కార్యాలయంలో మంగళవారం ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్సై నాగరాజు మాట్లాడుతూ విద్యార్థినుల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని, వారికి ఎలాంటి సమస్య వచ్చినా పోలీసులకు సంప్రదించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థుల ప్రవర్తనను గమనించాలని, అనుమానాస్పందంగా ఉంటే తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు.


మాట్లాడుతున్న ఎస్సై నాగరాజు

సనాతన ధర్మమే సాయి ధర్మం

మార్కాపురం టౌన్: సనాతన ధర్మమే సాయి ధర్మమని జ్ఞానసాయి మందిరం అధ్యక్షుడు సీహెచ్ రజనీకుమార్ అన్నారు. మంగళవారం మార్కాపురం పట్టణంలోని నెహ్రూ బజారులో ఉన్న సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి మాసోత్సవాల్లో భాగంగా ఆధ్యాత్మిక ఉపన్యాసం చేశారు. బాబా ప్రతి రోజూ ద్వారకామయిలో రామాయణ, భారత, భాగవత పారాయణాలు నిర్వహించేవారని శాశ్వతంగా అగ్నిహోత్రం, ధుని, నిత్య దీపారాధన, శంఖానాధం, ఘంటానాధం, తులసీపూజ చేసేవారని, విష్ణుసహస్ర నామం బోధించేవారని అన్నారు. అనంతరం రజనీకుమార్‌ను మందిర అధ్యక్ష కార్యదర్శులు పేరం సత్యనారాయణ, గోపాలుని హరిహరావు, పీవీఎల్ నాగరాజు, కరీమ్, కృష్ణమోహన్ తదితురులు ఘనంగా సన్మానించారు.


రజనీకుమార్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అధిక ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు


పొదిలి: ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తే, సంబంధిత యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని డీవైఈఓ మామిళ్లపల్లి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ప్రైవేటు స్కూళ్ల యజమానులతో సమావేశం నిర్వహించారు. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. పలు రకాల ఫీజులు వసూలు చేస్తున్నారని, పుస్తకాలు కూడా తమ వద్దే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. తనిఖీలు నిర్వహించి, ఆరోపణలు నిజమైతే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రైవేటు పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు సమస్యలు ఎదురైతే నేరుగా తనను సంప్రదించాలని సూచించారు. డీవైఈఓను హబీబుల్లా ఫౌండేషన్ చైర్మన్ కరీముల్లా బేగ్ సత్కరించారు.


శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న కరీముల్లా బేగ్

సోలార్ వినియోగం పెంచడమే లక్ష్యం

దర్శి (కురిచేడు): విద్యుత్ వినియోగదారులు సోలార్‌ను వినియోగించుకునేలా సిబ్బంది ప్రోత్సహించాలని విద్యుత్ శాఖ ఎస్‌ఈ కట్టా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. దర్శిలోని పీటీఎస్ కళ్యాణ మండపంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఇప్పటి వరకు 1650 సోలార్ కనెక్షన్‌లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సోలార్‌పై వినియోగదారులకు అవగాహన కల్పించి కింది స్థాయి నుంచి ఎగువ స్థాయి వరకు విద్యుత్ అధికారులు ప్రతి ఒక్కరూ రెండు కనెక్షన్లు ఏర్పాటు చేయటమే లక్ష్యంగా పని చేయాలని, ఒక కిలో వాట్‌కు 30 వేల రూపాయలు, రెండు కిలోవాట్లకు 60 వేల రూపాయలు, మూడు కిలోవాట్లకు 78 వేల రూపాయల సబ్సిడీ ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. అధిక కరెంటు బిల్లుల భారాన్ని తగ్గించుకునేందుకు వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీనియర్ అకౌంట్ ఆఫీసర్ కె.సుబ్బారావు, ఈఈ పి. శ్రీనివాసులు, డీఈఈ పి.రవి కుమార్, దర్శి డివిజన్‌లోని డిప్యూటీ ఈఈలు, ఏఈలు, ఏఏఓలు, జేఏఓలు పాల్గొన్నారు.

కుక్కల బెడద.. కోతుల తంటా!


అరిస్తే కరుస్తా..


గొట్లగట్టు బస్టాండ్‌లో గుంపులుగా ఉన్న శునకాలు


నాగిరెడ్డిపల్లిలో గుంపుగా రోడ్డు దాటుతున్న కోతులు


ఓ ఇంటి ఆవరణలో కోతుల హడావుడి

- గ్రామాల్లో తరచూ కుక్క, కోతి కాట్లకు గురవుతున్న ప్రజలు

కొనకనమిట్ల: మండలంలోని పలు గ్రామాల్లో వీధి కుక్కలతో పాటు కోతుల గుంపులు రాజ్యమేలుతున్నాయి. కోతులు, కుక్కలు గ్రూపులుగా విడిపోయి పరస్పరం దాడి చేసుకోవడంతో పాటు వీధుల్లో వెళ్లే ప్రజలను వెంటబడి కరుస్తూ దడ పుట్టిస్తున్నాయి. కోతులు ఇళ్లలోకి చొరబడి తినుబండారాలు, చేతికి చిక్కిన వస్తువులు ఎత్తుకెళ్తున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎవరైనా అదిలిస్తే బెదిరించి మరీ వస్తువులు పట్టుకెళ్తుండటంతో వాటి జోలికి వెళ్లేందుకు జంకుతున్నారు. కుక్కలు, కోతుల దాడిలో ఎక్కువగా చిన్నారులే గాయపడుతున్నారు. కుక్కలు, కోతుల బారి నుంచి రక్షణ కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.